సాక్షి
బాపట్ల
శుక్రవారం ၊ 30 ၊ జూన్ ၊ 2023



పెదకాకానిలో పూజలు

పెదకాకాని: తొలి ఏకాదశి సందర్భంగా గురువారం పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.



దుర్గమ్మకు రూ.లక్ష విరాళం

విజయవాడ: దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన కె.రవితేజ కుటుంబం గురువారం రూ.1,01,116 విరాళం సమర్పించింది.

ఏపీ ఎస్పీఎఫ్ కమాండెంట్‌గా శంకరరావు



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) విజయవాడ జోన్ కమాండెంట్‌గా ముద్దాడ శంకరరావు గురువారం భవానీపురంలోని జోన్ కమాండెంట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ కమాండెంట్‌గా పనిచేసిన డాక్టర్ కె.ఎన్.రావు రాజవండ్రి బదిలీ అయ్యారు.

ఏకాదశివందనం

ప్రమదగణాలన్నీ గళమెత్తి జయజయధ్వానాలు చేసినట్టు.. నందీశ్వరుడు రంకెలేస్తూ ఆనంద తాండవం ఆడినట్టు.. హరహర మహాదేవ శంభోశంకర నినాదం డమరుకనాదమై మార్మోగినట్టు.. గుడి గంటలు పంచాక్షరి మంత్రమై లయకారుడిని కీర్తించినట్టు.. జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తిపారవశ్యంతో ఉప్పొంగాయి. జనహర్షధ్వానాలతో పిక్కటిల్లాయి. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం ఆధ్యాత్మికోత్సాహంతో పరవళ్లు తొక్కాయి.



కోటప్పకొండపై భక్తుల రద్దీ



వినుకొండలో స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కోటప్పకొండ.. భక్తజన 'దండ'

- త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకున్న వేలాది మంది భక్తులు
- ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండపై త్రికోటేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా పోటెత్తారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామికి విశేష అభిషేకాల అనంతరం ఆలయ అధికారులు భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉచిత, ప్రత్యేక, అభిషేక దర్శనం క్యూలైన్లన్నీ యాత్రికులతో కిక్కిరిశాయి. రద్దీ అధికంగా ఉండటంతో మూలవిరాట్ అభిషేకాలు నిలిపివేసి అభిషేక మండపంలో నిర్వహించారు. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీరు అందించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నవగ్రహ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. అన్నదాన మండపంలో ఉచిత ప్రసాద పంపిణీని ఆయన ప్రారంభించారు. ఆలయం వెనుక ఉన్న రావి చెట్టు వద్ద మహిళలు పూజలు నిర్వహించి పొంగళ్లు పొంగించారు. ధ్యానశివుని విగ్రహం, నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. సోపాన మార్గం ద్వారా మెట్లపూజ చేసుకుంటూ భక్తులు కొండపైకి చేరుకున్నారు. పాతకోటయ్య ఆలయంలో భక్తుల తాకిడి కనిపించింది. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. ఘాట్‌రోడ్డులోని పార్క్ వద్ద యాత్రికుల సందడి నెలకొంది. పార్క్ సమీపంలో ట్రాఫిక్ గంటన్నరపాటు నిలిచింది. ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, ఈఓ వై.శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వినుకొండ.. హరధ్యానమే మదినిండా

- రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న 2లక్షల మందికిపైగా భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మల్లికార్జునరావు

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ కొండపై వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు రెండు లక్షల మందికిపైగా స్వామిని దర్శించుకున్నారని అంచనా. వెల్లటూరు రోడ్డులో నుంచి కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు భక్తులతో కిక్కిరిసింది. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం చేయడంతో ఈ ఏడాది భక్తులు అంచనాలకు మించి తరలివచ్చారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సాధారణ క్యూలైన్‌లో వెళ్లి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండపై జరిగిన పూర్ణాహుతి హోమం వద్ద ఇద్దరూ పూజలు చేసి పూర్ణాహుతి సమర్పించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొండపై పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపార యూనియన్లు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో రెండు లక్షల మందికిపైగా భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కొండపైకి వెళ్లేందుకు బస్సులు నడిపింది. 10 భారీ విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నాయి. సాంఘిక, పౌరాణిక నాటకాలు, కోలాటాలు, భజనలు, ప్రవచనాలు భక్తులను ఆధ్యాత్మికోత్సాహంలో ఓలలాడించాయి.

శాంతిభద్రతల రక్షణలో ఏఆర్ విభాగం కీలకం

- తొలి ఏకాదశి సందర్భంగా ఏఆర్ విభాగం, పోలీసు అవుట్‌పోస్టులు ప్రారంభం
- ఆయుధాలకు పూజలు
- కూరగాయలు, ఆకుకూర విత్తనాలు నాటిన ఎస్పీ రవిశంకర్

నరసరావుపేట: శాంతి భద్రతల పరిరక్షణలో ఏఆర్ విభాగం ఎంతో ప్రాముఖ్యమైందని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా ఏఆర్ ప్రధాన కార్యాలయాన్ని రిబ్బన్ కట్‌చేసి ఎస్పీ ప్రారంభించారు. భద్రపర్చిన ఆయుధాలు, ఇతర భద్రతా పరికరాలకు పూజలు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఏఆర్ అవుట్ పోస్ట్(గార్డు పోస్టురూమ్)నూ ప్రారంభించారు. ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు ఆధ్వర్యంలో పోలీస్ కార్యాలయ ఆవరణలోని వ్యవసాయ క్షేత్రంలో ఏరువాక కార్యక్రమం చేపట్టి విత్తనాలు చల్లారు. ఎస్పీ మాట్లాడుతూ నిత్యం శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది తలమునకలై ఉంటారన్నారు. వారి ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో క్యాంటీన్ ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. దీనిలో ఆరోగ్యకరమైన భోజనాన్ని అందించడం కోసం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోనే సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నామని వివరించారు. ప్రజలకు బక్రీద్, తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె.చంద్రశేఖర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎస్పీలు కె.వి.మహేష్, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏఆర్ కార్యాలయంలో ఆయుధాలకు పూజలు చేస్తున్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి

న్యూస్‌రీల్

ఉద్యోగోన్నతుల ధమాకా



ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయినికి ధ్రువపత్రం అందజేస్తున్న డీఈఓ శైలజ (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం కలగకుండా సర్కారు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా ఉపాధ్యాయ లోకం ఎంతో కాలంగా ఎదురు చూసిన బదిలీలు, ఉద్యోగోన్నతులను అర్హతే ప్రామాణికంగా ప్రతిభకు ప్రాధాన్యమిచ్చి విజయవంతంగా పూర్తి చేసింది. దీనివల్ల ఏర్పడిన తాజా ఖాళీలనూ యుద్ధప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సీనియార్టీ ప్రాతిపదికన అర్హులైన గురువులతో భర్తీ చేసేందుకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌కు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. దీనికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.

ఖాళీలు ఇలా..

ఇటీవల ఉపాధ్యాయ బదిలీలను సమర్థంగా నిర్వహించిన ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కేడర్లలో పని చేస్తున్న 529 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించింది. క్షేత్రస్థాయిలో కీలకంగా ఉన్న ఎంఈఓలకు పనిభారం తగ్గించే ఉద్దేశంతో ఎంఈవో-2 పోస్టులను మంజూరు చేసింది. అర్హత కలిగిన హెచ్ఎంలతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 58 ఎంఈఓ-2 పోస్టులను దీంతో 44 హెచ్ఎం పోస్టులు ఖాళీ అయ్యాయి. అలాగే హైస్కూళ్లలో ప్రారంభించిన ప్లస్ టూ తరగతుల బోధన కోసం సబ్జెక్టుల వారీగా స్కూల్ అసిస్టెంట్లను ఉద్యోగోన్నతులతో భర్తీ చేశారు. దీనివల్ల దాదాపు 200 మేర స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ అయ్యాయి. వీటన్నింటినీ ఉద్యోగోన్నతులతో భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది.

నేడు సీనియార్టీ జాబితాలు విడుదల

44 హెచ్ఎం, 200 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు అర్హులతో కూడిన సీనియార్టీ జాబితాను శుక్రవారం విద్యాశాఖ అధికారులు విడుదల చేయనున్నారు. శని, ఆదివారాల్లో సంబంధిత ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచే ఉద్యోగోన్నతుల ప్రక్రియ జరగనుంది.

వ్యవసాయ డిప్లొమా కోర్సుల దరఖాస్తుకు గడువు పెంపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచినట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల కోరిక మేరకు గడువును జూలై 10 వరకూ పెంచినట్లు వెల్లడించారు. దరఖాస్తుల్ని ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పంపాలని సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 808.60 అడుగుల వద్ద ఉంది.

గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: ప్రయాణికుల సౌకర్యార్థం వారాంతపు ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ గురువారం వెల్లడించారు. పూర్ణ-తిరుపతి రైలును (07609) వయా గుంటూరు డివిజన్ మీదుగా జూలై 3 నుంచి 28 వరకు ప్రతి సోమవారం కేటాయించినట్లు తెలిపారు. తిరుపతి-పూర్ణ (07610) రైలును వయా గుంటూరు డివిజన్ మీదుగా జూలై 4 నుంచి 29 వరకు ప్రతి మంగళవారం కేటాయించినట్లు పేర్కొన్నారు. కాచిగూడ-కాకినాడ టౌన్ మీదుగా జూలై 1న ప్రత్యేక రైలు(07215)ను వయా గుంటూరు డివిజన్ మీదుగా కేటాయించినట్లు వివరించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1,600, మోడల్ ధర రూ.1200 వరకు పలికింది.

'వైద్య'వైడూర్యం నాట్కో

క్యాన్సర్ వైద్యంలో గుంటూరు జీజీహెచ్ నాట్కో సెంటర్ వైడూర్యమై మెరుస్తోంది. అత్యాధునిక సేవలతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కీర్తిపతాకను రెపరెపలాడిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్య హస్తాల మీదుగా 2020 జూలై 1న వర్చువల్‌గా ప్రారంభమైన ఈ ఆస్పత్రి పేద రోగులకు అండగా నిలుస్తోంది. క్యాన్సర్‌పై శుక్రవారం గుంటూరులో రాష్ట్రస్థాయి సమావేశం జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

- క్యాన్సర్ రోగులకు భరోసా
- ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు
- ఖరీదైన ఆపరేషన్లూ పైసా ఖర్చు లేకుండా

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో గతంలో క్యాన్సర్ రోగులకు కేవలం రేడియేషన్ సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక జీజీహెచ్‌లో నాట్కో సెంటర్ ప్రారంభమైంది. సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ వైద్య విభాగాలు, పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఫలితంగా రోజూ క్యాన్సర్ రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. క్యాన్సర్ సెంటర్‌లో ప్రత్యేక చికిత్సలు అందించేందుకు స్పెషాలిటీ వైద్యులు, సిబ్బంది నియామకాలను ప్రభుత్వం చేపట్టింది. ఫలితంగా కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా క్యాన్సర్ రోగులకు సేవలందుతున్నాయి.

వంద పడకలతో క్యాన్సర్ వార్డు

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్యాన్సర్ వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం, నాట్కో ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సుమారు రూ.45 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో వంద పడకలతో క్యాన్సర్ వార్డును నిర్మించారు. ఆపరేషన్ల కోసం ప్రత్యేకంగా రూ.60 లక్షలతో ఆపరేషన్ థియేటర్లను నిర్మించారు. ప్రత్యేకంగా క్యాన్సర్ వార్డును నిర్మించిన మొట్టమొదటి ప్రభుత్వ ఆస్పత్రిగా గుంటూరు జీజీహెచ్ అరుదైన రికార్డు సృష్టించింది. క్యాన్సర్ రోగులకు తొలి రిఫరల్ ఆస్పత్రిగా కూడా గుంటూరు జీజీహెచ్ రికార్డుల్లోకి ఎక్కింది.

ప్రత్యేకతలు

- రేడియేషన్, మెడికల్, సర్జికల్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ డిపార్టుమెంట్, రేడియోథెరపీ డిపార్టుమెంట్, సర్జికల్ ఐసీయూ, మెడికల్ ఐసీయూలతోపాటు ఓపీ, ఐపీ చికిత్సల కోసం రోగులకు, వైద్యులకు, వైద్య విభాగాధిపతులకు, వైద్య సిబ్బందికి ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేశారు.
- రోగులకు వ్యాధి తగ్గేంత వరకు నాట్కో ఫార్మా కంపెనీ తయారు చేసే మందులను ఉచితంగా అందించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేశారు.
- ప్రభుత్వం రూ. 17 కోట్లను వైద్య పరికరాల కోసం మంజూరు చేసింది. వీటితో సుమారు రూ.12 కోట్లు ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్ వైద్య పరికరాన్ని, రూ.5 కోట్లు ఖరీదు చేసే బ్రాకీథెరపీ, సిటి స్టిమ్యులేటర్ వైద్య పరికరాలను సమకూర్చింది.
- ఆధునిక లీనియర్ యాక్సిలేటర్ ద్వారా ఇతర శరీర అవయవాలు దెబ్బతినకుండా కేవలం క్యాన్సర్ సోకిన భాగానికి మాత్రమే చాలా షార్ప్‌గా రేడియేషన్ చేరుతోంది.



గుంటూరులోని నాట్కో క్యాన్సర్ సెంటర్

జీజీహెచ్‌లో నాలుగేళ్లలో చికిత్స పొందిన రోగులు ఇలా..

సంవత్సరం	చికిత్స పొందిన వారి సంఖ్య	జరిగిన ఆపరేషన్ల సంఖ్య
2020	2,067	---
2021	11,265	220
2022	13,107	395
2023	7,192	337

(నోట్: 2020లో కరోనా వల్ల ఆపరేషన్లు జరగలేదు)

క్యాన్సర్ నివారణే లక్ష్యం



క్యాన్సర్ వ్యాధిని నివారించటమే లక్ష్యంగా నాట్కో ట్రస్ట్ ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో తొలిసారిగా రూ.45 కోట్లతో క్యాన్సర్ సెంటర్ నిర్మించింది. క్యాన్సర్ రోగులకు నాట్కో ట్రస్ట్ పలు రకాల మందులను ఉచితంగా అందిస్తోంది. మెరుగైన వైద్యం ఉచితంగా అందించేందుకు ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ వీసీ నన్నపనేని పలు కార్యక్రమాలను చేస్తున్నారు.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్‌ఛైర్మన్

ఈద్ 'శుభా'రక్





పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఫలితంగా మసీదులు, ఈద్గాలు కళకళలాడాయి. ఆధ్యాత్మికోత్సాహంతో తళుకులీనాయి. గుంటూరు నగరంపాలెం ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ చేస్తున్న ముస్లింలను చిత్రంలో చూడొచ్చు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ప్రకృతి అందాలకు 'కొండవీడు' ప్రతిబింబం కావాలి

యడ్లపాడు: కొండవీడు కోటను హరితమయం చేసి సందర్శకులకు సరికొత్తగా చూపించేందుకు అటవీ శాఖ కృషి చేస్తోందని రాష్ట్ర ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వై.మధుసూదన రెడ్డి చెప్పారు. కొండవీడును గురువారం ఆయన సందర్శించారు. కొండవీడు నగరవనం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. డీఎఫ్‌వో రామచంద్రరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొండవీడు నగరవనంలో భారీగా మొక్కలు నాటేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని చెప్పారు. 1500 మొక్కల్ని ఇచ్చేందుకు దాతలు ముందుకొచ్చినట్లు తెలిపారు. నెమళ్ల బురుజు ఎదురుగా వ్యూ పాయింట్, వెదుళ్ల చెరువుపై ఏర్పాటు చేసిన డెక్‌లతో పాటు సందర్శకుల కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా తెచ్చిన ఆర్చరీ పరికరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కొండవీడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణమ్మ పాల్గొన్నారు.

గుండె'చెరువు'

- ఆడుకుంటూ వెళ్లి చెరువు కుంటలో పడిన బాలిక
- బురదలో కూరుకుపోయి మృత్యువాత
- తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు



యద్దనపూడి: అప్పటివరకు ఆనందంగా తోటి పిల్లలతో కలిసి కేరింతలు కొడుతూ ఆడిన ఆ బాలిక అంతలోనే అదృశ్యమైంది. చెరువుకుంట బురదలో కూరుకుపోయి మృత్యుఒడికి చేరింది. ఈ హృదయ విదారక ఘటన మండలంలోని కఠారువారిపాలెంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన వేల్పూరి వినోద్, అనిత భార్యాభర్తలు. చీరాలలో ఉంటూ కూలి పనులు చేసుకునేవారు. వారం క్రితమే కఠారువారిపాలేనికి వచ్చి ఇక్కడే చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. వీరి కుమార్తె వేల్పూరి హారిక (9)ను చిమటావారిపాలెంలోని ఎంపీపీ పాఠశాలలో, కుమారుడు చెన్నకేశవులును మార్టూరులో ప్రైవేటు పాఠశాలలో చేర్చారు. కఠారువారిపాలెం నుంచి చిమటావారిపాలేనికి 2 కిలోమీటర్లు ఉండటంతో ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు శ్యాంప్రసాద్ ప్రతిరోజూ హారికతో పాటు మరో బాలికను బడికి తీసుకెళ్లి ఇంటి దగ్గర వదులుతాడు. ఈ క్రమంలో బుధవారం కూడా వారిద్దరినీ గ్రామంలో వదిలి వెళ్లాడు. సాయంత్రం 6 గంటల వరకు పిల్లలతో ఆడుకుంటూ ఉన్న హారిక ఆ తరువాత కనిపించలేదు. పొలం పనుల నుంచి ఇంటికొచ్చిన తల్లిదండ్రులు పాప కోసం వెతికినా జాడలేదు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే గ్రామానికి వచ్చిన ఎస్ఐ కె.అనూక్ సిబ్బందితో గ్రామ పరిసరాల్లో వెతకడం మొదలుపెట్టారు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువుకుంట వద్ద బురదలో పాప అడుగు జాడలు కనిపించాయి. నీటిలో పడిపోయి ఉంటుందని అనుమానించిన పోలీసులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈలోపే స్థానికులు మోటార్ల సాయంతో కుంటలో నీటిని బయటకు తోడేశారు. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో పాప మృతదేహం బురదలో కూరుకుపోయినట్లు గుర్తించి బయటకు తీశారు. విగతజీవిగా మారిన బిడ్డను చూసి ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

2న జిల్లాస్థాయి కర్రసాము పోటీలు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో జూలై 2వ తేదీన జిల్లాస్థాయి కర్రసాము పోటీలను నిర్వహిస్తున్నట్లు సిలబం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఈ పోటీలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించేది లేదు

- ఒక్కరోజులో జిల్లాలో 281 మందిపై కేసులు నమోదు
- జూన్ నెలలో 2387 మందిపై కేసులు నమోదు
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఒక్కరోజులో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 281 మందిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 2387 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ వారిలో వారు గొడవలు పడి హత్యలు, హత్యాయత్నాలకు, ఇతర నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి వారి వలన ప్రజాశాంతికి భంగం కలిగి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం వల్ల నేరాలు తగ్గుతాయనే ఉద్దేశంతో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. మహిళలు, పిల్లలు తిరిగే ప్రదేశాల్లో, రోడ్ల పక్కన, చెట్ల కింద, వాహనాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం తాగుతున్న, ప్రజాజీవనానికి భంగం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్న వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నెంబర్లు డయల్ 100, 112లకు, ఎస్పీ బాపట్ల హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ప్రజాశాంతికి భంగం వాటిల్లకుండా ఉండడానికి నిత్యం నిర్మానుష్యమైన ప్రదేశాల్లో, బహిరంగ ప్రదేశాల్లో పోలీస్ సిబ్బంది గస్తీలు నిర్వహిస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. తరచూ వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలన్నారు.

రంగురాళ్ల తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు



శంకరపురం కొండపై గుంతలు పరిశీలిస్తున్న సీఐ సురేంద్రబాబు

దాచేపల్లి : శంకరపురం సమీపంలోని కొండపై రంగురాళ్ల కోసం తవ్వకాలు జరిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎ.సురేంద్రబాబు హెచ్చరించారు. శంకరపురం కొండను అటవీశాఖ అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. కొండపై తవ్విన గుంతలను పూడ్చివేయాలని నిర్ణయించారు. అటవీభూముల్లో తవ్వకాలు జరపటం చట్టరీత్యా నేరమని, అక్రమంగా అటవీభూముల్లోకి ప్రవేశించి తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ చెప్పారు. శంకరపురం కొండ పరిసర ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులకు సీఐ సూచించారు. ఈ పరిశీలనలో డీఆర్వో మురళి, బీట్ అధికారులు రాకేష్, మనోజ్ తదితరులున్నారు.

మెదడును అర్థం చేసుకోవడం నేటికీ ఒక సవాలే..

కేఎల్‌యూ ఛైర్మన్ కోనేరు సత్యనారాయణ

తాడేపల్లి రూరల్: మనిషి మెదడును అర్థం చేసుకోవడం నేటికీ సవాలుగానే ఉందని కేఎల్‌యూ ఛైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్.యూనివర్సిటీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ యూనివర్సిటీలోని వివిధ విభాగాలకు చెందిన 43 మంది అధ్యాపకుల బృందం న్యూరో శాస్త్రవేత్త డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు పర్యవేక్షణలో మెదడు పనితీరు, వ్యాధులపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పని చేస్తోందని తెలిపారు. జర్నల్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్‌లో న్యూరో డెజెనరేటివ్ వ్యాధులపై పరమాణు మార్గాలు, చికిత్స – సవాళ్ల గురించి ప్రత్యేక సంచికను త్వరలో విడుదల చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. అల్జీమర్స్ (మతిమరుపు), పార్కిన్సన్స్ (వణుకుడు) వ్యాధులు వంటి న్యూరో డెజెనరేటివ్ రుగ్మతలు ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలపై ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. సాధారణ ఆరోగ్యకరమైన మెదడు 1.5 కిలోలు ఉంటే న్యూరో డెజెనరేటివ్ వ్యాధులు సోకి వారి మెదడు పరిమాణం తగ్గుతుందని వివరించారు. డాక్టర్ ఎడ్వర్డో ఒర్టెగా, నేషన్ సెక్రటేరియట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ ఆఫ్ ఇన్నోవేషన్, పనామా న్యూరో డెజెనరేటివ్ వ్యాధుల గురించి మాలిక్యులర్ పాత్ వేస్, థెరప్యూటిక్ చాలెంజ్‌ల రంగంలో ప్రత్యేక సంచికలను ప్రచురించారని సత్యనారాయణ వెల్లడించారు. తాము తేనున్న సంచికకు అతిథి సంపాదకులుగా కేఎల్‌యూ ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు వ్యవహరిస్తారని తెలిపారు. మాలిక్యులర్ పాత్ వేస్ అండ్ థెరప్యూటిక్ చాలెంజెస్ అనే అనుబంధ సంచికను అంతర్జాతీయ బృంద సభ్యులు ఆస్ట్రేలియా నుంచి లెజాన్ ఓయి, యుఎస్ఏ నుంచి మురళీధర్, ఎల్ హెగ్డే, చైనా నుంచి యాన్ జాంగ్, సింగపూర్ నుంచి జాన్ చువా జియా మొదలగు వారు సవరించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు పాల్గొన్నారు.

పర్చూరుకు వచ్చిన క్రికెటర్ రాయుడు



బ్యాట్‌లపై సంతకాలు చేస్తున్న అంబటి రాయుడు

పర్చూరు (చినగంజాం): టీం ఇండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు గురువారం పర్చూరుకు విచ్చేశారు. పర్చూరులో అరీనా క్రికెట్ గ్రౌండులో జరుగుతున్న యువ క్రికెటర్ల తర్ఫీదుని చూసేందుకు వచ్చినట్లు క్రికెట్ క్లబ్ సభ్యులు తెలిపారు. యువ క్రికెటర్ల ఆటను చూసి వారికి కొన్ని మెళకువలు నేర్పించారు. ఆయనతో సంతకం, ఆయనతో కలిసి ఫొటో దిగేందుకు పలువురు స్థానికులు పోటీలు పడ్డారు. కొందరు యువ క్రికెటర్లు ఆయనతో ఫొటో దిగడం, తమ బ్యాట్‌లపై సంతకాలు చేయించుకోవడంలో ఉత్సాహాన్ని కనబరిచారు, యువ క్రికెటర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

నేడు గుంటూరులో క్యాన్సర్‌పై రాష్ట్రస్థాయి సమావేశం

గుంటూరు మెడికల్: నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఎన్‌సీజీ) ఏపీ స్టేట్ చాప్టర్ వార్షిక సమావేశం జూన్ 30, జూలై 1 తేదీల్లో గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో జరుగుతుందని సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ టి.వి. శివరామకృష్ణ తెలిపారు. కామన్‌గా ఉండే క్యాన్సర్‌లకు ఎన్‌సీజీ గైడ్‌లైన్స్ ప్రకారం ఏ విధంగా చికిత్సలు అందించాలి, క్యాన్సర్ చికిత్సలు అందరూ పొందే విధంగా చేరువ చేయాలనే అంశాలపై రెండురోజులపాటు సదస్సులో నిపుణులంతా చర్చిస్తారన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే రెండురోజుల సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు. గౌరవ అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. క్రిష్ణబాబు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ ఎం.ఎన్. హరేంద్రప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌ఎల్‌వీ నరసింహం, విశాఖపట్నం హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంత్‌షెట్టి విచ్చేస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, నాట్కో ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి హాజరవుతున్నారన్నారు. ఎవిడెన్స్ బేస్ట్ ఆంకాలజీ ఫర్ సర్వైకల్ క్యాన్సర్, ఎవిడెన్స్ బేస్ట్ ఆంకాలజీ ఫర్ లంగ్ క్యాన్సర్, ఎవిడెన్స్ బేస్ట్ ఆంకాలజీ ఫర్ హెచ్ఎన్ క్యాన్సర్, ఎవిడెన్స్ బేస్ట్ ఆంకాలజీ ఫర్ బ్రెస్ట్ క్యాన్సర్, ఎవిడెన్స్ బేస్ట్ ఆంకాలజీ ఫర్ గ్యాస్ట్రిక్ క్యాన్సర్, ఇమ్యునోథెరపీ అండ్ టార్గెటెడ్ థెరపీస్ ఫర్ కామన్ క్యాన్సర్స్, ఎవిడెన్ బేస్ట్ అండ్ కాస్ట్ ఎఫెక్టివ్ ఆప్షన్స్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఇన్ హెల్త్ స్కీమ్స్ అనే అంశాలపై రెండు రోజులపాటు సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ వైద్యనిపుణులు, ఉన్నతాధికారులు చర్చిస్తారని వెల్లడించారు.

వైభవంగా ద్వితీయ అఖండ జ్యోతి ప్రజ్వలన



అఖండ జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన, కలెక్టర్



తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక రామలింగేశ్వరస్వామి కొండపై ద్వితీయ అఖండ జ్యోతి ప్రజ్వలనతో వినుకొండ భక్తిపారవశ్యంతో మునిగిపోయింది. హరహర మహాదేవ అంటూ భక్తుల జయధ్వానాల మధ్య అఖండ జ్యోతిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జిల్లా కలెక్టర్ శివశంకర్ వెలిగించారు. హిమాలయ బాబా ఆధ్వర్యంలో అఖండ జ్యోతిని 1000 కిలోల ఆవు నెయ్యి, 650 మీటర్ల వత్తితో తయారు చేశారు. తమిళనాడులోని అరుణాచలం సమీపంలోని తిరువణ్ణామలై సమీపంలో 72 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన అఖండజ్యోతి మాదిరి వినుకొండ కొండపై ఏర్పాటు చేయడం విశేషం. దాదాపు 21 కిలోమీటర్లు దూరం వరకు దర్శనమిచ్చే జ్యోతిని చూసేందుకు భక్తులు భారీగా కొండకు చేరుకున్నారు. ప్రత్యక్షంగా వీక్షించడం కుదరని వారి కోసం భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. తొలి ఏకాదశి సందర్భంగా లక్షల మంది భక్తులు అఖండ జ్యోతి చూసి తరించారు. తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి, వాటిపై ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పురాతన దేవాలయాలను సందర్శించిన సివిల్ జడ్జి

ఆలయాలలో తొలి ఏకాదశి పూజలు



అనకాపల్లి జడ్జి నాగేంద్రరావుకు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఈఓ

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి, గంగాపార్వతి సమేత లింగోద్భవ స్వామి, బగళాముఖి అమ్మవారి దేవాలయాలను అనకాపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగేంద్రరావు గురువారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానంతరం సీనియర్ సివిల్ జడ్జికి బగళాముఖి అమ్మవారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. వేటపాలెం ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మలు కూడా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు పలువురు భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

తీరంలో బ్లడ్ బ్యాంక్ సేవలు ఎనలేనివి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



బ్లడ్ కాంపోనెంట్స్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

రేపల్లెరూరల్: తీరంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సేవలు ఎనలేనివని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లడ్ కాంపోనెంట్స్ స్టోరేజ్ సెంటర్ గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 15 ఏళ్లుగా దాతల విరాళంతో రేపల్లె ప్రాంత ప్రజలకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సేవలందిస్తుండటం అభినందనీయమన్నారు. బ్లడ్ కాంపోనెంట్ స్టోరేజ్ ఏర్పాటుతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. రక్తంలోని లిక్విడ్‌లను, సెల్స్‌ను వేరుచేసి రక్త కణాలను భద్రపరిచే వీలుంటుందన్నారు. రక్తం అవసరమైన క్షతగాత్రునికి రక్తం కాకుండా సెల్స్ అందించటంతో దుష్ప్రభావాలు చోటుచేసుకోవన్నారు. తీరప్రాంత ప్రజలకు బ్లడ్ బ్యాంక్ సేవలను మరింత మెరుగ్గా అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ వైస్ చైర్మన్ వేజెండ్ల పూర్ణానంద్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

- ఆటోను ఢీకొన్న కారు
- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

కారెంపూడి: ఆటోను కారు ఢీకొన్న దుర్ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి తీవ్ర గాయాలైన ఘటన కారెంపూడి ఇందిరాకాలనీ సెంటర్‌లో బుధవారం రాత్రి 11 గంటలకు చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంకు చెందిన రెండు కుటుంబాల వారు తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని తిరిగి వస్తూ నరసరావుపేటలో రైలు దిగారు. అక్కడ నుంచి ఆటోలో కొత్తపుల్లారెడ్డిగూడెం బయలుదేరారు. మార్గంమధ్యలో కారెంపూడి వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ఆ ప్రాంత యువకులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జయకుమార్, పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కారెంపూడి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేట జీబీఆర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కొత్తపుల్లారెడ్డిగూడెంకు చెందిన కేతావత్ వీరాంజనేయనాయక్ తలకు బలమైన గాయాలు కావడంతో కోమాలో ఉన్నారని, కేతావత్ లక్ష్మీపార్వతి కాలు విరిగి తలకు గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాలుడు కేతావత్ అఖిల్‌నాయక్ కాలు కూడా విరిగినట్లు తెలుస్తోంది. కేతావత్ బుజ్జినాయక్, మూఢావత్ గౌరిభాయి, కేతావత్ ముత్యాలభాయి, కేతావత్ సాయిమోక్షిత, చిలకలూరిపేటకు చెందిన ఆటో డ్రైవర్ గాలెం వెంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారిలో చింతపల్లి గ్రామానికి చెందిన యువకునితోపాటు అతని స్నేహితులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరికి స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. ఈ ఘటనతో కొత్తపుల్లారెడ్డి గ్రామస్తులంతా కారెంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు.

ఆంధ్రా సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

- తొలిరోజే రెండు సెంచరీల నమోదు
- కృష్ణా జట్టుపై ప్రకాశం జిల్లా జట్టు ఘన విజయం



ఎం.అభినవ్ (163 నాటౌట్)



విష్ణుదత్త (104 పరుగులు)

నరసరావుపేట ఈస్ట్: పెద చెరువులోని ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 బాలుర ఆంధ్ర సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ప్రకాశం, కృష్ణా జిల్లాల మధ్య తొలి మ్యాచ్ జరిగింది. ప్రకాశం జిల్లా జట్టు 80 పరుగుల తేడాతో కృష్ణా జట్టుపై విజయం సాధించింది. ప్రకాశం జిల్లా జట్టులోని ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లు సెంచరీలు సాధించి విజయాన్ని ఖరారు చేశారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రకాశం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 314 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జట్టులోని విష్ణుదత్త 127 బంతుల్లో 104 పరుగులు సాధించగా, ఎం.అభినవ్ 138 బంతుల్లో 163 పరుగులతో అజేయంగా నిలిచాడు. కృష్ణా జట్టు బౌలర్ యోచన్‌కు రెండు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు ఓటమి పాలైంది. నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 234 పరుగులు మాత్రమే చేసింది. కృష్ణా జట్టులోని నిశ్చయ్ 67, ఖాజా 26 పరుగులు సాధించారు. ప్రకాశం జట్టు బౌలర్లు పి.దుర్గాబాలాజీ, జి.గురుప్రీత్‌లకు చెరో మూడు వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి. పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు. ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లా జట్ల మధ్య శుక్రవారం రెండవ మ్యాచ్ జరగనుంది.

యరపతినేని అనుచరుడిపై కేసు నమోదు

దాచేపల్లి: అటవీశాఖ సిబ్బందిపై దాడి ఘటనలో టీడీపీ నేత యరపతినేని శ్రీనివాసరావు అనుచరుడు, భట్రుపాలెం ఎంపీటీసీ మాజీ సభ్యుడు భూక్యా రంగానాయక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. శంకరపురం సమీపంలో అటవీశాఖ సిబ్బందిని అడ్డగించి దాడికి పాల్పడిన ఘటనలో రంగానాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.సురేంద్రబాబు గురువారం తెలిపారు. ఈనెల 27వ తేదీ రాత్రి శంకరపురం కొండపై కొంతమంది వ్యక్తులు రంగురాళ్లు తవ్వి ఆటోలో తరలిస్తున్నట్లు అటవీశాఖ బీట్ అధికారులకు సమాచారం అందింది. వారు ఆటోను వెంబడించారు. శంకరపురం సమీపంలో అటవీశాఖ సిబ్బందిని మాజీ ఎంపీటీసీ రంగనాయక్ ఆపి దాడి చేశారు.

గంజాయి ముఠా గుట్టురట్టు



పట్టుకున్న గంజాయితో సీఐ సూర్యనారాయణ, పోలీసు సిబ్బంది

ఇంకొల్లు (చినగంజాం): అక్రమంగా గంజాయి కలిగి ఉన్న ముఠాను ఇంకొల్లు పోలీసులు గురువారం పట్టుకున్నారు. సీఐ వీ సూర్యనారాయణ వివరాల మేరకు.. గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్ తన బృందంతో కలిసి పావులూరు రోడ్డులో టీటీడీ కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు నడుచుకుంటూ వస్తుండగా వారిని తనిఖీ చేశారు. వారి వద్ద 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.6 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మండలంలోని బండకాలనీకి చెందిన తిరుపతి నాగేశ్వరరావు, అదే కాలనీకి చెందిన కర్పూరపు పోలయ్యలుగా గుర్తించారు. వారితోపాటు మూడో వ్యక్తి తన్నీరు సుబ్బారావు పరారీలో ఉన్నట్లు చెప్పారు. గంజాయిని పట్టుకున్న ఇంకొల్లు పోలీసులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. గంజాయి వాడకందారులు, సరఫరా చేసిన వారిపై ప్రత్యేక బృందాలతో పటిష్ట నిఘా పెట్టినట్లు, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చించారు.

చికిత్స పొందుతూ మృతి

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందతూ బాధితుడు మరణించిన ఘటనపై గురువారం మార్టూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసుల వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన ముప్పాళ్ల రాజశేఖర్ (45) ఈనెల 23వ తేదీ నెల్లూరు నుంచి బైకుపై స్వగ్రామం వెళ్తున్నాడు. స్థానిక ఇసుక దరిశి వద్ద జాతీయ రహదారిపై అర్ధరాత్రి కురుస్తున్న వర్షానికి వాహనం అదుపుతప్పి రాజశేఖర్ తీవ్రంగా గాయపడగా 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు రాజశేఖర్‌కు భార్య ఇద్దరు కుమార్తెలున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి..

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓవ్యక్తి మృతిచెందాడు. జే.పంగులూరు మండలం రేణింగవరానికి చెందిన రాయని పెద్దబ్బాయి (60) అద్దంకి పట్టణంలోని ద్వారకానగర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి



పిడుగురాళ్లరూరల్: మండలంలోని గుత్తికొండ, గుళ్లపల్లి అటవీ ప్రాంతంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... గుత్తికొండ గ్రామానికి చెందిన దార్ల నరసింహారావు చిన్నామ్మయి దంపతులు. నరసింహారావు ఇటీవలే మృతి చెందాడు. వారి కుమారుడు సాంబశివరావు ఐటీఐ పూర్తిచేసి ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం గుత్తికొండ, గుళ్లపల్లి అటవీ కురుపు ప్రాంతంలో గుడికి వెళ్లే దారిలో సాంబశివరావు మంటలకు కాలిపోతుండగా గుత్తికొండ గ్రామానికి రామయ్యతో పాటు ఆ మార్గంలో వెళుతున్న మరి కొంత మంది చూశారు. 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనం వచ్చే సరికి సాంబశివరావు మృతి చెంది ఉన్నాడని తెలిపారు. తల్లి చిన్నామ్మయి కుమారుడు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పిడుగురాళ్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.